# ఆత్మీయులు

**-షకీల్ అహ్మద్**

జానకమ్మ కొడుకును తలచుకోని రోజంటూ లేదు. ఈడొచ్చిన అబ్బాయి ఇలా చెప్పా పెట్టకుండా ఇంట్లోంచి వెళ్లిపోతే ఆ తల్లి కడుపు కోత అంతా ఇంతా కాదు. రామయ్య కూడా లోలోన బాధపడుతున్నా పైకి బింకం నటిస్తున్నాడు. ఆయన మొదటినుంచీ అంతే... చాలా పట్టుదల గల మనిషి. పరువు మర్యాదలంటే ప్రాణమిస్తాడు. అలాంటిది పై చదువుల కొరకు పట్నానికి వెళ్లిన కొడుకు శ్రీధర్ అక్కడ ఎవరో ఒక అనాధ పంజాబీ అమ్మాయిని ప్రేమించాననీ, పెళ్లి చేసుకుంటానని కూర్చున్నాడు. అయితే రామయ్య మాత్రం ఆ పెళ్లికి ఒప్పకోలేదు. ఊళ్లోనే మంచి సంబంధం ఉందనీ, తను చూసిన అమ్మాయినే పెళ్లి చేసుకోవాలని పట్టుబట్టాడు. శ్రీధర్ రాజీ పడలేదు. రామయ్య దిగి రాలేదు. పంతాలకు పోయి ఇక ఇంటి ముఖం చూడననీ, ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటానని శ్రీధర్ ఇల్లు వదిలాడు.

రామయ్య మెత్తబడకపోగా తన బొందిలో ప్రాణం ఉండగా ఇంటి గడప తొక్కవద్దనీ, తన పేరూ, ఊరు సైతం ఇక నీ నోటి నుండి ఎప్పుడూ రాకూడదని కొడుకును ఆదేశించాడు. తండ్రీ కొడుకుల గొడవలో తల్లి ఆవేదన అర్థం చేసుకునేవారు కరువయ్యారు. అలాగే సంవత్సరాలు దొర్లిపోయాయి. ఎంత ఆప్యాయతగా చూచినా ఆవిడ మాటను ఏనాడూ విలువైనదిగా పరిగణించలేదు రామయ్య. ఇప్పుడూ అదే తంతు. ఆ వ్యధను మోయలేక ఆ తల్లి మనసు భారమైంది. గుండె ఇక కొట్టుకోలేను అని చేతలెత్తేసింది. మంచాన పడిన జానకమ్మ మరి లేవలేదు. చివరిసారిగా ఆవిడ నిర్జీవ శరీరమే లేచింది నలుగురి భుజాల ఆసరాతో.

అప్పుడూ రామయ్య గుండె కరగలేదు. కొడుకుకు కనీసం కబురైనా చేయలేదు. అసలు తనెక్కడున్నాడో తెలిస్తే కదా! చదువు ముగిసాక రెక్కలు వచ్చిన పక్షిలా ఉద్యోగం కోసం దేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లాడో ఎవరికి తెలుసు?

మరోసారి ఒంటరితనం అల్లుకుంది రామయ్యను. ఆ ఒంటరితనం భరించలేనిదిగా మారినప్పుడు తొలిసారిగా తన మనుషులు అంటూ లేకపోతే ఎలా వుంటుందో తెలిసొచ్చింది రామయ్యకు. అప్పుడు కన్నీళ్ల పొరల్లో మెల్లగా కదిలింది కొడుకు రూపం.

నిజానికి రామయ్య మంచి స్థితిపరుడే. పొలాలు, పుట్రా ఉన్నాయి. పాడి వుంది. ఊళ్లో అందమైన మూడంతస్థుల మేడ వుంది. అయితే ఆయన గడుసుతనం, నోటి దురుసుతనంవల్ల ఎవరూ ఆయనకు దగ్గరగా వెళ్లే ప్రయత్నం చేయరు. బంధువులతో కూడా వైరం పెట్టుకున్నాడు రామయ్య. ఇప్పుడు అదే శాపం అయింది. రోజులు సంవత్సరాలు అవుతున్నాయి. దిక్కులు రెక్కలు కట్టుకున్నాయి.

★★★

భర్త పోగానే దిక్కులేనిదయింది మాలతి. అసలే అనాద. ఇప్పుడు నాలుగేళ్ల కొడుకుతో మళ్లీ ఒంటరిదయింది. అంతవరకూ భర్తతో సంతోషంగా గడిపిన జీవితం ఆమె కళ్లముందు మెదిలి ఆమెను కదిలిస్తే కన్నీటి కాసారమే అవుతోంది. పెళ్లికి తల్లిదండ్రులను ఒప్పిస్తానని ఊరికి వెళ్లిన శ్రీధర్ వారితో శాశ్వతంగా తెగతెంపులు చేసుకుని రావడం, ఇక జీవితంలో వారి గురించి మన మధ్య ప్రస్తావన రాకూడదని ఒట్టు వేయించుకోవడం జరిగిపోయింది. మంచి రోజు చూసుకుని గుడిలో తాళికట్టి రిజిస్ట్రేషన్ ఆఫీసులో దండలు మార్చుకున్నారు శ్రీధర్, మాలతిలు. రోజులు చాలా సంతోషంగా గడుస్తున్నాయి. ఏం మాట్లాడితే భర్తకు కోపం వస్తుందో అని అసలు మాలతి ఎప్పుడూ అత్తమామల గురించిగానీ, వారి ఊరు పేరు గురించిగానీ భర్తను అడగలేదు. భర్తే తనకు సర్వస్వం అనుకుంది. పెళ్లయిన మూడేళ్లవరకు పిల్లలు వద్దనుకున్నారు. కాస్త స్థిరపడ్డాక పిల్లల గురించి ఆలోచిద్దాం అనుకున్నారు.

రెండు మూడేళ్ల తరువాత ప్రైవేట్‌లోనే అయినా కాస్త మంచి ఉద్యోగమే దొరికింది శ్రీధర్‌కు. కంపెనీ వారిచ్చిన క్వార్టర్స్‌లోకి మారారు. ఈ లోగా పియుష్ పుట్టాడు. రోజులు సంతోషంగా గడుస్తున్నాయి. అయితే విధి ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా. జీవితాలతో ఆడుకున్నప్పుడే దాని ఉనికి మనిషికి గుర్తుకు వచ్చేది.

ఆ రోజు సాయంకాలం ఒకటే వర్షం. ఆఫీసు నుండి ఇంటికి వెళ్లే దారిలోనే బస్టాప్‌లో చాలా సేపు నిలబడ్డాడు శ్రీధర్. వర్షం పెరుగుతూనే వుందిగానీ తగ్గే సూచనలు కనిపించడం లేదు. బస్టాపులో జనం పెరిగిపోతున్నారు. రెండు మూడు బస్సులు వచ్చినా జనం ఎగబడ్డారు. ఇక లాభం లేదనుకుని అలాంటి బస్సులోనే ఎక్కాడు శ్రీధర్. అయితే ఫుట్‌బోర్డుపై నిలబడ్డ అతను బస్సు కాస్త ముందుకు కదలగానే పట్టు తప్పి పడిపోవడం, వెనుక నుండి వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టడం ఒకేసారి జరిగాయి. కొనప్రాణాలతో వున్న శ్రీధర్‌ను ఆ వర్షంలో ఎవరో సాయంపట్టి హాస్పిటల్‌కు చేర్చినా లాభం లేకపోయింది. ప్రాణాలు ఎప్పుడో పోయాయి అన్నాడు డాక్టర్. ఈ వార్త పిడుగులా పడింది మాలతి నెత్తిమీద. నాఅన్నవారు లేరు, కట్టుకున్నవాడు పోయాడు. చంటిపిల్లాడితో తాను ఒక్కతే. అయితే శ్రీధర్ కంపెనీ యజమానులు కాస్త దయ దలచి అతనికి రావాల్సిన గ్రాట్యుటీని త్వరగా ఇచ్చేసారు. తమ కంపెనీలోనే చిన్న ఉద్యోగంలో చేరమని మాలతికి ఆఫర్ ఇచ్చారు. అయితే తను ఇక ఆ ఊర్లో ఉండాలనుకోవడంలేదని మాలతి చెప్పడంతో తమ కంపెనీకి చెందిన మెటీరియల్ ప్రొడక్షన్ బ్రాంచ్ రాచపల్లిలో ఉందని, అక్కడికి వెళితే పల్లెటూరి వాతావరణంలో మనసు ప్రశాంతంగా ఉంటుందని సలహా ఇచ్చారు. మాలతి ఒప్పుకుంది.

★★★

పెట్టేబేడతో ఒంటరిగా చంటిపిల్లవాడ్ని వేసు


కుని దిగిన మాలతివైపు విచిత్రంగా చూసారు ఆ ఊరివారు. ఉత్తరాది అమ్మాయిలా ఉందే అనుకుని ఎవరి తాలూకు అని ఆరా తీసారు. అక్కడికి ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న కంపెనీలో ఉద్యోగి అని తెలుసుకున్నారు. అయితే కంపెనీ క్వార్టర్స్‌లో ఖాళీ లేనందున కొన్నాళ్లుండడానికి అద్దె ఇల్లు కావాలని అడిగింది మాలతి. ఆ పల్లెటూరిలో ఊరికే ఇస్తేనే ఉండడానికి ఎవరూ రారు. ఇక అద్దె కూడానా? అని ఆశ్చర్యపోయారు జనాలు. అంతలో ఆ ఊరి మునసబు అక్కడి నుండి వెళుతూ విషయం కనుక్కున్నాడు. అరె... అద్దె ఇంటికేంకానీ అంత నాజూకైన అమ్మాయిని మట్టిగోడలు, పాక పెంటల మధ్య ఉంచడం సరికాదనిపించింది మునసబుకి. ఆ వీధి చివర్లో వున్న మూడంతస్థుల మేడలో చాలా రోజులుగా ఎవరూ లేరు. ఇల్లంతా పాడుబడింది. అంతా కాకున్నా కింది పోర్షన్‌లో ఉండవచ్చు అని సలహా ఇచ్చాడు మాలతికి. ఆమె సరేనంది. అయితే చుట్టుపక్కలవాళ్లు ఆ ఇల్లు మంచిదికాదని, ఆ ఇంటి గోడనానుకునే స్మశానం మొదలవుతుందని, ఆ ఇంటిపై ఏవో దుష్టఛాయలు ఉన్నాయని ఇంకా ఏవేవో చెప్పారు. మాలతికి ఇవన్నీ సిల్లీగా అనిపించాయి. చిరునవ్వు నవ్వి ఆ ఇంట్లోకి షిఫ్ట్ అవుతానని చెప్పింది. ఇద్దరు మనుషులను పెట్టి కింది పోర్షన్ శుభ్రపరచి అందులోకి దిగింది.

***

ఒకరోజు సాయంత్రం చీకటి పడేవేళ ఎవరో తలుపు తడుతున్న శబ్దం వినిపించి లేచి వెళ్లి తీసింది. ఎదురుగా ఓ ముసలాయన. అతని చేతిలో పీయుష్ ఉన్నాడు. మాలతి ఖంగుతింది. చటుక్కున పిల్లవాడ్ని అందుకుని "ఎవరు మీరు? వీడు లోపల పడుకుంటున్నవాడల్లా మీ దగ్గరకి ఎలా వచ్చాడు?" అడిగింది మాలతి.

"నా పేరు రామయ్య. ఈ వీధిలోనే వుంటాను. ఏదో అవసరంపడి ఇటునుండి వెళ్తున్నాను. ఈ బాబు మీ పిల్లాడే అనుకుంటాను. నిద్రలో నడుస్తూ వాకిట్లో వున్న చేదు బావి దగ్గరకు వెళ్తున్నాడు. పరుగెత్తి అందుకుని ఇక్కడకు తీసుకువచ్చాను. బాబు జాగ్రత్తమ్మా" అని వెళ్లిపోయాడతను.మాలతికి తల తిరిగింది. ఇందాక తానే పిల్లవాడ్ని నిద్ర పుచ్చింది. హాల్లో కూర్చుని ఏదో నవల చదువుకుంటోంది. ఈలోగా వీడు బయటకు ఎప్పుడు వెళ్లాడో తనకర్థం కాలేదు. సరేలే అనుకుని నిద్రకు ఉపక్రమించింది.

పొద్దున బాబుతోపాటు కంపెనీకి వెళుతున్నప్పుడు దారిలో రామయ్య కనబడ్డాడు. రాత్రి జరిగిన విషయం గుర్తుకొచ్చి ఎదురుగా వెళ్లి థాంక్స్ చెప్పింది.



రామయ్య్య చిరునవ్వు నవ్వి తాను ఇక్కడే ఉంటానని, ఏ సహాయమైనా కావాలంటే అడగమని చెప్పాడు. సరేనని ముందుకు కదిలింది మాలతి. చుట్టూ వున్న జనం మాలతి అలా విచిత్రంగా మాట్లాడడం చూచి కనుబొమలు, భుజాలు ఎగరేసి తమ పనుల్లో పడ్డారు.

సాయంత్రం ఇంటికొస్తూనే బాబుని దించి మొహం కడుక్కోవడానికి బావి దగ్గరకు వెళ్లిన మాలతికి గేటు తీసుకుని చడీ చప్పుడు కాకుండా రామయ్య లోపలకు రావడం చూచి ఒక్క క్షణం గుండె కొట్టుకుంది. ఈ మనిషేమిటి అనుకుంది. అయినా చిరునవ్వు నవ్వి లోపలకు రమ్మని పిలిచింది. వస్తూనే బాబుని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు రామయ్య. బాబు కూడా రామయ్యకు బాగానే అలవాటుపడ్డాడు.

అది మొదలు ఎప్పుడూ మాలతికి చేదోడువాదోడుగా ఉంటూ ఇంటి పనులు, బయట పనులు చేసి పెడుతున్నాడు రామయ్య. మాలతి కూడా అతన్ని పెద్దాయనా అని పిలుస్తూ తన ఇంటి మనిషిగానే చూస్తోంది.

తలవని తలంపుగా అతను అన్ని పనుల్లో సహాయపడడం సంతోషంగా ఉంది మాలతికి. అయితే ఒకటీ అరాసార్లు అతను ఆమె భర్త గురించి, కుటుంబం గురించి అడిగినా ఎందుకో మాలతికి చెప్పబుద్ధి కాలేదు. ఏదో చెప్పి మాట దాటేసింది.

***

ఊళ్లోకి వచ్చి సంవత్సరం అవుతోంది. ఇప్పుడు బాబును స్కూల్లో చేర్పించింది మాలతి. అతని బాధ్యతను పూర్తిగా తలకెత్తుకున్నాడు రామయ్య. మాలతి దగ్గరకన్నా రామయ్య దగ్గరే ఎక్కువ వుంటున్నాడు బాబు. ఏదో ఒక బంధం వాళ్లని దగ్గర చేసిందని మాత్రం ఆమెకు తరచుగా అనిపించేది.ఇంటి ప్రహరీగోడకు దగ్గరలోనే స్మశానంలో కొట్టొచ్చినట్లు కనబడే రెండు సమాధులుండేవి. బాగా పాతబడి ఉన్నాయి. వాటిపై పేర్లున్నా దుమ్మూ ధూళికి, గాలి దెబ్బకు అవి బాగా మసకబారి పోయి చదవడానికి వీల్లేకుండా పోయాయి,. అవి ఎవరివో తెల్సుకోవాలన్న జిజ్ఞాసగానీ అవసరంగానీ కలగలేదు మాలతికి.ఇదిలా వుంటే ఒకరోజు అనుకోని సంఘటన జరిగింది. సెలవురోజు కనుక మాలతి ఇంటి దగ్గరే ఉంది. రామయ్య వచ్చాడు. అతన్ని చూడగానే 'తాతా! తాతా! బయటకు పోదాం' అని మారాం చేసాడు పియుష్. మాలతికి కాస్త తలనొప్పిగా వుంది.

'బాబును తీసుకువెళ్లి కాసేపు బయట ఆడించు పెద్దాయనా' అని చెప్పింది మాలతి. సరేనంటూ పియుష్‌ను చల్లగాలి వీస్తోంది కదా అని పక్కనే వున్న చెరువుగట్టు దగ్గరకు తీసుకువెళ్లాడు రామయ్య. అంతవరకూ బాగానే నడిచిన పియుష్ హఠాత్తుగా రామయ్య చేయి విడిపించుకుని పరుగెత్తాడు. ఆ చెరువుగట్టుమీదనే శివాలయం వుంది. రామయ్య అక్కడిదాకా వెళ్లినవాడు ఆగిపోయాడు. అలా పరుగెత్తుతూపోయిన బాబు పట్టుతప్పి పక్కనున్న చిన్న కోనేట్లో పడిపోయాడు. అదృష్టవశాత్తు నీళ్లు తక్కువగా ఉండడం, అక్కడే కొంతమంది కూర్చుని ఉండడంతో బాబును వెంటనే కాపాడారు. పియుష్‌ను గట్టుమీదకు తెచ్చినవాళ్లు 'ఎవరితో వచ్చావు బాబూ?' అని అడిగారు. తాతతో వచ్చాను అంటూ పియుష్ చుట్టూ చూసాడు. అక్కడ రామయ్య లేడు. అంతలో ఎవరో తెలిసినవాళ్లు అక్కడి నుండి వెళుతూ 'అరె... ఇతను మాలతమ్మ కొడుకు' అని అతడ్ని తీసుకెళ్లి మాలతికి అప్పగించారు. అదేమిటి పెద్దాయన అలా ఎప్పుడూ చేయడే అనుకున్నా ఎందుకో ఆ మాట రామయ్యను అడగలేకపోయింది మాలతి.

***


ఒకరోజు రాత్రి పెద్దగా వీస్తున్న గాలికి కిటికీ తలుపులు బాగా కొట్టుకుంటుంటే మూద్దామని లేచిన మాలతికి ఇంటి ఆవరణలో బావి దగ్గర కూర్చుని బీడీ కాలుస్తున్న రామయ్య కనబడ్డాడు. ఒళ్లు జలదరించింది మాలతికి. టైము చూసింది పన్నెండో పన్నెండున్నరో అవుతోంది.

ఇంట్లో ఉబ్బరంగా అనిపిస్తే ఓసారి డాబా మీదకు వెళ్దామని మెట్లెక్కబోయింది మాలతి. అంతలో ఎక్కడి నుండో హఠాత్తుగా వచ్చిన రామయ్య మెట్లకు అడ్డంగా నిలబడి "వద్దమ్మా! ఎప్పుడూ ఈ భవంతి మూడవ అంతస్థుకు వెళ్లకు. అది నీకు మంచిదికాదు. నా మాట విను...విను" అని ఏదో



## నిరాశలో భానుశ్రీ

దేవదాస్‌లో ఇలియానాలాగా, దేశముదురులో హన్సికలాగా, హ్యాపీడేస్‌లో తమన్నాలాగా 'వరుడు' చిత్రంతో తాను కూడా తారాపథంలోకి దూసుకుపోతానని ఎంతగానో ఆశపడిందిట భానుశ్రీ. కానీ ఆ చిత్రం పరాజయం పొందడంతో ఆమె తీవ్ర నిరాశకు లోనయింది. ఈ చిత్రం పరాజయంతో సరైన అవకాశాలు రాక, వచ్చిన చిన్నా చితకా అవకాశాలను ఒప్పుకోలేక ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అర్థం కాకుండా తనలో తాను మధనపడుతోందిట భానుశ్రీ.



పూనకం వచ్చినవాడిలా చెప్పాడు. భయపడిపోయింది మాలతి. "సరేలే పెద్దాయనా వెళ్లను" అని లోపలకు వెళ్లిపోయింది.

★★★

ఇంకోసారి గుమ్మానికి ఎదురుగా వున్న నిలువెత్తు అద్దంలో చూసుకుని జడ వేసుకుంటున్న మాలతికి లోపల బాబుతో నవ్వుతూ మాట్లాడుతున్న రామయ్య్ గొంతు విని 'ఈయనెప్పుడొచ్చాడబ్బా?' అని ఆశ్చర్యం, అనుమానం ఒకేసారి కలిగాయి. అయినా బయటపడలేదు.

ఒకరోజు సాయంత్రం పిల్లలతో ఆడుకుంటున్న పియుష్ వేసిన బంతి మేడపైకి వెళ్లింది. పిల్లలంతా ఒకటే గోల బంతి కావాలని. సమయానికి పెద్దాయనా లేడు. పైకి వెళ్దామంటే పెద్దయనకు కోపం వస్తుందేమోనని భయం. సరేలే చూద్దాం అనుకుని మెల్లగా మెట్లెక్కి మూడవ అంతస్థులోకి వెళ్లింది మాలతి. బంతి నేరుగా వెళ్లి అద్దాల కిటికీని పగలగొట్టి గదిలోకి వెళ్లిందేమో అక్కడ పెద్ద రంధ్రం పడింది. తలుపుకు పెద్ద తాళం వేళాడుతోంది. లోపలకు వెళ్లడం ఎలా అని ఆలోచిస్తున్న మాలతి మెల్లగా కిటికీ అద్దంలోనుండి లోపలకు చూసింది. ఎదురుగా గోడకు నిలువెత్తు ఫోటో. దానికి పొడవాటి ఎండిన పూలదండ. ఒక్కసారిగా కరెంటు షాక్ కొట్టిన అనుభూతి. కాళ్లు వంకర్లు పోతున్నాయి. గజగజ వణికిపోయింది. ముచ్చెమటలు పోసాయి. పరుగులాంటి నడకతో కిందకి దిగింది. అంతలో గేటు పక్కనుండి లోపలకు వస్తున్న రామయ్య్ ఇది చూసి ఏమీ మాట్లాడకుండా వెదుదిరిగిపోయాడు. మాలతి అతడ్ని చూడలేదు.మాలతి మంచంమీద వాలగానే మెదడులో ఎన్నో ప్రశ్నల తుంపర. రామయ్య్ ఎవరు? ఎవరికీ దగ్గర కానంతగా తనకు తన బిడ్డకు మాత్రమే ఎందుకు దగ్గరయ్యాడు? బాబును శివాలయంలో వదిలేసి రామయ్య్ ఎందుకు వెళ్లిపోయాడు? అద్దంలో ఆ రోజు లోపలకు వెళ్లిన రామయ్య్ ఎందుకు కనిపించలేదు? ఆలోచనలతో బుర్ర వేడెక్కి జ్వరం పట్టుకుంది మాలతికి.

★★★

రెండవరోజు కనులు తెరిచింది మాలతి. ఎదురుగా రెపరెపలాడుతున్న కాగితం. ఎవరో పెట్టి వెళ్లారు. చేతిలోకి తీసుకుంది. కాగితం ఎగిరిపోయి అద్దానికి అతుక్కుంది. అద్దంలో రామయ్య్ రూపం.

"అమ్మా! ఎంతగానో ప్రేమించిన కొడుకు అనుకోకుండా మమ్మల్ని అన్యాయం చేసాడన్న అసంతృప్తి, దూరమయ్యాడనే బాధతో నా భార్య కన్నుమూసింది. అప్పటిదాకా అంతులేని కోపంతోవున్న నాకు ఒంటరితనం ఆవహించేసరికి నా కొడుకులేని లోటు తెలిసింది. అయితే వాడ్ని ఎక్కడని వెదకను? బంగారంలాంటి కోడలిని, మనవడ్ని చేజేతులా పోగొట్టుకున్నాననే బాధ తీవ్రరూపం దాల్చింది. ఆత్మీయులను పోగొట్టుకుంటే కలిగే బాధ ఏమిటో చూసాను. ఆత్మీయతలు, అనురాగాలే ఆలంబనగా మనిషి జీవిస్తాడనీ, అవి లేని మనిషి బ్రతుకు మరణం కన్నా భయంకరమైనదనీ చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. నిజంగా చాలా ఆలస్యం జరిగిపోయింది. నా పాపం తెలుసుకున్నా దాని నిష్కృతికి మార్గం కనబడలేదు. ఈ జ్యోతి ఎన్నో ఏళ్లు ఎదురుచూసింది. మిమ్మల్ని ఊరి పొలిమేరల్లో చూసిన మొదటి రోజే మీ సాంగత్యం ఎంతో సుఖాన్ని కలిగించింది. మీతో గడిపే అవకాశమూ కలిగింది. అయితే నువ్వు నేను చేయవద్దన్న పని చేసావు. నా సంగతి తెలిసిన తరువాత నన్ను నీవు మునుపటిలా చూడలేవు అన్న భయంతోనే అలా చెప్పాను. ఇక నేను వెళ్లవలసిన తరుణం వచ్చింది. మరుజన్మ అంటూ వుంటే నీకు కొడుకై పుట్టి నా పాప పరిహారం చేసుకుంటాను. సెలవు. ఎప్పటికీ తిరిగిరాని...

నీ మామయ్య్!"

అద్దంలో రూపం పొగగా మారిపోయింది. అద్దం తన ప్రతిబింబాన్ని చూపిస్తోంది. మాలతి అన్ని దిక్కులూ చూసింది. ఎవరూ లేరు. గాలి కొట్టిన దెబ్బకు మూడవ అంతస్థులోని ఫోటో క్రిందపడి భళ్లున పగిలింది.

రాత్రి కురిసిన వానకు దుమ్ము కరిగిపోయి సమాధులమీద పేర్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

జానకమ్మ, రామయ్య్!

★



## డబుల్ బ్యాక్ ఫ్లిప్

నేటి యువత అనితరసాధ్యమైన సాహసాలు చేయడంలో ముందుంటున్నారు. అందుకు చక్కని ఉదాహరణ... ఇటీవల సిడ్నీ హార్బర్‌లో కామెరన్ సింక్లెయిర్ (ఆస్ట్రేలియన్) మోటార్ బైక్‌పై గాలిలో రెండుసార్లు పల్టీలు కొడుతూ విజయవంతంగా నీటిలో పడుతున్నప్పుడు తీసిన అపురూపమైన చిత్రం.

-తటవర్తి

